

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

16

**జూడీ ఇంటికి** సెయింట్ లూయీకి ఫోను చేసింది. జూడీ లైన్‌లోకి రాగానే చెప్పింది.

"హాయ్! వాణి ఫ్రం సెనోజే."

"ఓస్! ఎప్పుడు వచ్చావ్?" అడిగింది జూడీ ఆనందంగా.

"రెండు రోజులయింది."

"ఎన్ని రోజులుంటున్నావు?"

"మా తాతయ్య పోయారు. ఇక ఇండియా వెళ్ళను."

"ఐ యామ్ హేపీ అండ్ అన్ హేపీ."

"సుసాన్ ఎలా ఉంది?" అడిగింది వాణి.

"గ్రేట్.. సింగిల్ పేరెంట్ అయింది తెలుసా?"

"తెలియదే కొడుకా, కూతురా?"

"కూతురు. విడిగా సింగిల్ ఒక బెడ్‌రూం ఫ్లాట్‌లో ఉంటోంది. "

"'సిక్స్ టు మిడ్‌నైట్' అనే సూపర్ బజారులో సేల్స్ గర్ల్‌గా పని చేస్తోంది."

"చదువు ఆపేసినట్లేనా?"

"ప్రస్తుతానికట. పిల్ల పెద్దవగానే మళ్ళీ చదువుతుందట."

"ఎవరతను?"

"సుసాన్‌కే తెలియదట ఫన్నీ."

"వెరీ ఫన్నీ! నీ సంగతేమిటి?"

"లాట్స్ ఆఫ్ బాయిస్. ఫెడప్. సెటిల్ అవుదామనుకుంటున్నాను."

"గోయింగ్ స్టెడీ విత్ ఎనీవన్?"

"అఫ్‌కోర్స్! అతను అటార్నీ."

"అటార్నీ? నీకో జోక్ చెప్పనా?"

"నేనే చెప్తాను విను, స్టీవ్‌కి డైవర్స్ వచ్చాక ఫ్రెండ్స్ అడిగారు. ప్రాపర్టీ డివిజన్ ఎలా చేసుకున్నారని. ఫిఫ్టీ ఫిఫ్టీ అన్నాడు స్టీవ్. నీకు సగం, మీ ఆవిడకి సగమా అంటే, 'కాదు మా ఆవిడకి సగం, నా లాయర్‌కి సగం' అన్నాట్ట" నవ్వింది జూడీ.

"నే చెప్పదల్చుకున్న జోక్ అదికాదు. ఓడ మునిగి సముద్రంలోని ప్రయాణీకులు నీళ్ళపాలయితే, సముద్రంలోని షార్క్ చేపలన్నీ అందరినీ తినేశాయి ఒక్క లాయర్‌ని తప్ప. ఎందుకనో తెలుసా? - ప్రొఫెషనల్ కర్టెసీ!"

"గ్రేట్ జోక్! ఏంబ్రూకి చెప్తానిది"

"అతని పేరు ఏంబ్రూనా?"

"ఎస్. మా పెళ్ళవగానే మెంఫిస్‌కి మూవ్ అవుతాం. అక్కడ లాఫర్మ్‌లో చేరబోతున్నాడు. ఎప్పుడొస్తున్నావ్ సెయింట్ లూయీకి?"

"ఏమో?" భుజాలెగరేసి చెప్పింది వాణి.

"కీప్ ఇన్ టచ్. విల్ యూ?"

"ష్యూర్"

"బైదివే ఎనీ గుడ్ డేస్ ఇన్ ఇండియా?"

"నోప్"

"ఏం?"

"పాతివ్రత్యాన్ని ప్రాక్టీస్ చేసే దేశం అది."

తర్వాత జూడీ తల్లిదండ్రులతో కూడా మాట్లాడింది వాణి. వాణితో ఎంతో ఆదరంగా మాట్లాడారు ఇద్దరూ.

"ఫ్రిస్కోలో ఉన్నావా? యు ఆర్ లక్కీ" చెప్పింది జూడీ తల్లి మిసెస్ థాంప్సన్.

అమెరికన్స్ అందరికీ వెస్ట్ కోస్ట్‌లోని లాస్ ఏంజెలెస్, శాన్‌ఫ్రాన్సిస్కోలో జీవించాలని ఉంటుంది. ఎవరయినా ఆఫీస్ క్యాంప్‌మీద అటువైపు వెళితే 'ఐ యామ్ గోయింగ్ వెస్ట్' అని గర్వంగా చెప్పుకుంటారు. కాలిఫోర్నియా రాష్ట్రం అమెరికాలోని అతి ఐశ్వర్యమంతమైన రాష్ట్రం. ఆ రాష్ట్రంలోని లాస్‌ఏంజెలెస్‌లో విలాసవంతమైన జీవితానికి అవకాశం ఎక్కువ కాబట్టి ఆ గ్లామర్.

వాణి సుసాన్‌కి కూడా ఫోన్ చేసి మాట్లాడింది. సుసాన్ మూడు నెలల కూతురు ఏడుపుని స్నేహితురాలికి ఫోన్‌లో వినిపించింది.

"నీ కూతురి తండ్రి ఎవరు?" అడిగింది వాణి సంగతి తెలిసినా, తెలియనట్లుగా, అమాయకంగా.

"నలుగురు 'నేనంటే నేనే' అని పోటీ పడుతున్నారు" గట్టిగా నవ్వింది సుసాన్ అది జోక్‌గా భావించి.

"గ్రేట్!"

"జేమ్స్ బ్లడ్ టెస్ట్ చేయించి తండ్రిని నిర్ణయించమని అడుగుతున్నాడు చూడాలి"

"మరి నువ్వు సూపర్ బజారుకి వెళితే నీ కూతుర్ని ఎవరు చూస్తున్నారు?"

"ప్రస్తుతానికి నా రూంమేట్. షి ఈజ్ వెరీ హెల్ప్‌ఫుల్. నాలాకాక అబార్షన్ చేయించుకుంది ఏడాది క్రితం. ఇప్పుడు అందుకు గిల్టీగా ఫీలవుతోంది. లారాని చూసుకోవడం డోరీన్‌కి ఎంతో ఇష్టమైన పని."

"నీ కూతురు పేరు లారానా?"

"అవును చిన్నప్పటినుంచి ఆ పేరంటే ఇష్టం. బావుందా?" అడిగింది సుసాన్.

"లారా.. సౌండ్స్ గ్రేట్. ఐ లైకిట్."

"థాంక్యూ. లారా ఫోటోని నీకు మెయిల్ చేస్తాను. నీ అడ్రస్ ఏమిటి?" అడిగింది సుసాన్.

"సెవెంటీ వన్. లైమ్ వెల్ కోర్ట్ సేనోజా. సిఏ. నైన్ ఫైవ్ వన్ త్రీ ఎయిట్"

"గాటిట్. లారాకి ఫీడింగ్ టైం అయింది. బై వాణీ"

"బై సుసాన్"

వాణికి బుద్ధి తెలిశాక ఏర్పడ్డ మంచి ఫ్రెండ్స్ వాళ్ళిద్దరే. వాళ్ళిద్దరితో మాట్లాడాక ఎంతో తృప్తిగా అనిపించింది. సుసాన్ అనేక వేలమంది అమెరికన్ టీనేజర్స్‌లా ప్రవర్తించినందుకు బాధ కలిగింది వాణికి.

తన కిష్టమైన వ్యక్తిద్వారా గర్భందాల్చి, ఒంటరిగా ఆ బిడ్డని పెంచే తల్లులని 'సింగిల్ పేరెంట్స్'గా వ్యవహరిస్తారు. ఇదే ఇండియాలో అయితే ఆమెను చిన్నచూపు చూస్తారుకానీ, అమెరికన్ సమాజంలో అది తప్పుకానీ, విడ్డూరం కాని కాదు. అదో రకం జీవితంగా భావిస్తారంతే.

అలాగే పెళ్ళికాకుండా యువతీ యువకులు కలిసి ఉండటంకూడా ఆ సమాజంలో మాములే. 'లివిన్ బాయ్ ఫ్రెండ్'గా ఆమె అతన్ని వ్యవహరిస్తే 'లివిన్ గర్ల్‌ఫ్రెండ్'గా అతన్ని ఆమె వ్యవహరిస్తుంది. పెళ్ళి చేసుకుంటే విడాకుల బాధ అది ఉండదని ఇలా జీవిస్తూంటారు. నచ్చకపోతే ఏ రోజయినా తమ సామాను సర్దుకుని తలుపు బలంగా వేసి బయటకు నడిచి వెళ్ళిపోతారు. మళ్ళీ వాళ్ళిద్దరూ తమ జీవితాల్లో ఒకరికొకరు తారసపడకపోవచ్చు.

బస్సుకోసం ఎదురుచూస్తున్న వాణి చాక్‌లెట్ బార్ తిన్నది. పూర్తయ్యాక రేపర్ ఉండచుట్టి కింద పారేసింది. చుట్టుపక్కలవాళ్ళు తనవంక గుచ్చి గుచ్చి, మందలింపుగా చూడటం గుర్తించిన వాణి సిగ్గుపడి, ఆ రేపర్‌ను అందుకుని హేండ్‌బాగ్‌లో వేసుకుంది సూపర్ బజార్‌లోకి వెళ్ళాక దాన్ని ట్రాష్ కేన్‌లో పడేసింది.

ఆ రాత్రి భోజనాల దగ్గర చెప్పింది వాణి ఆ అనుభవం.

"ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారని ఊరికే అనలేదు. మూడేళ్ళు ఇండియాలో ఉంటే అక్కడి బుద్ధులే వస్తాయి మరి" చెప్పింది లక్ష్మి.

వాణి వచ్చిన సందర్భంగా వెంకటేశ్వరరావు మూడోరోజు రాత్రి ఆమెను ఘిరాడ్ ఢెల్లి స్క్వేర్‌లోని ఓ అమెరికన్ రెస్టారెంట్‌కి తీసికెళ్ళి 'హోమ్ కమింగ్ పార్టీ' ఇచ్చాడు.

గుమ్మం దగ్గర నిలబడ్డ రిసెప్షనిస్ట్ అడిగింది చిరునవ్వుతో.

"మే ఐ హెల్ప్ యు?"

"ఎస్ ఐ హేవ్ ఏ రిజర్వేషన్ ఇన్ ది నేమ్ ఆఫ్ మిస్టర్ వి. ఆర్. చల్లా!" చెప్పాడు వెంకటేశ్వరరావు.

"దిస్ వే ప్లీజ్"

ఫ్రాక్, బ్లౌజ్‌లలో ఉన్న ఆమె వాళ్ళను ఓ టేబుల్ దగ్గరకు తీసుకెళ్ళి కూర్చోబెట్టింది. టేబుల్ మీద రెడ్ అండ్ వైట్ చెక్స్ టేబుల్‌క్లాత్. రిసెప్షనిస్టు వేసుకున్నలాటి దుస్తులే ధరించారు వెయిట్రెస్‌లంతా. నడుము నుంచి, మోకాళ్ళదాకా ఏ ఫ్రాన్స్ ధరించారు.

మెత్తటి కార్పెట్స్, వెండి ఫోర్క్‌లు, స్పూన్స్, క్రిస్టల్‌వేర్ ఎక్కడ చూసినా ఖరీదయిన వాతావరణం.

వేయించిన వేడివేడి వేరు సెనగక్కాయలు ఓ వెండి పళ్ళెంలో తెచ్చి ఉంచింది వెయిట్రెస్. అందరికీ కోక్స్, తనకు బడ్‌లైజర్ బీర్ చెప్పాడు వెంకటేశ్వరరావు.

వేరుసెనగకాయల తొక్కులు ఒలిచి తిని, ఆ తొక్కులను కింద పడేయసాగారు. అమెరికాలో ఎక్కడా చెత్తపోయరు. డస్ట్‌బిన్స్‌లోనే వేయాలి. అది దగ్గరలో లేకపోతే, చిన్న కాగితం ముక్కయినా జేబులో వేసుకునీ, అది కనబడ్డప్పుడే దాంట్లో వేస్తారు.

శుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చే అలాంటి అమెరికాలో వేరుశెనగతొక్కలు కాయలు నేలమీద పడేయటం ఆ రెస్టారెంట్ ప్రత్యేకత. భోజనము అయ్యాక ఆ తొక్కలను చప్పుడయ్యేలా తొక్కుకుంటూ వెళ్తారు కష్టమర్స్. కేవలం ఆ అనుభవం కోసమే ఆ రెస్టారెంట్‌కి వస్తారు చాలామంది.

క్రేబ్స్ సూప్, రెండు రకాల బ్రెడ్‌లు, చికెన్ స్టీక్ సిజ్లర్, ఎగ్‌ఫ్యూయాంగ్, ఫ్రూట్ సలాడ్ విత్ క్రీమ్ ఆర్డర్ చేసాడు వెంకటేశ్వరరావు అందరికీ.

భోజనం చేస్తూ గాసిప్ మాట్లాడుకోసాగారు.

"సుహాసినీ చౌదరి కూతురు మేన్‌జూ తన కొడుకుని ఇండియాలో అమ్మమ్మ దగ్గరికి పంపించి ఉద్యోగంలో చేరింది" చెప్పింది లక్ష్మి వాణికి.

మంజు ఆమె అసలు పేరు కాని, ఇంగ్లీష్ స్పెల్లింగ్‌ను బట్టి 'మేన్ జూ' అని పిలుస్తారు. అమెరికన్స్ మంజూ చౌదరిని ఆమె కూడా 'నా పేరు ఇలా పలకాలి' అని వాళ్ళను కరెక్ట్ చేయకపోవడంతో వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులూ అందరిలా ఆమెను 'మేన్‌జూ' అనే సంబోధిస్తారు.

"నాకు పిల్లలు పుడితే ఉద్యోగం అయినా మానేస్తానుకాని, అలా ఎవరి దగ్గరికీ పంపను" చెప్పింది వాణి అక్క.

"మన దేశం నుంచి ఇమ్మిగ్రేషన్ వచ్చిన వాళ్ళకి పుట్టే వాళ్ళ దౌర్భాగ్యం అది" చెప్పింది లక్ష్మి కూడా.

అమెరికాలో బేబీ సిట్టింగ్ (పెద్దవాళ్ళు ఇంట్లో లేనప్పుడు పిల్లలని చూసుకునేవారు) చేసేవారు ఎక్స్‌పెన్సివ్. అంచేత భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేసే వాళ్ళు బర్త్ కంట్రోల్ పాటిస్తారు తప్ప పిల్లలను ఓ పట్టాన కనరు. అక్కడ పిల్లలను కనడానికి డాలర్లలో ఆలోచించి తీరాలి ఎవరయినా సరే.

భార్య ఉద్యోగానికి వెళ్ళకపోయినా పరవాలేదు అన్న ధీమా వచ్చాకే వాళ్ళు పిల్లల గురించి ఆలోచిస్తారు. ఇద్దరూ ఆఫీసుకు వెళితే బేబీ సిట్టర్‌లను తమ పిల్లల కోసం నియమించుకునే ఆర్థిక స్తోమత అతి కొద్దిమందికి ఉంటుంది.

కొందరు పిల్లల్ని కని మూడో నెల్లోనే ఇండియాలో తమ బంధువుల దగ్గరికి పంపుతారు. అయిదారేళ్ళదాకా అక్కడ పెరగనిచ్చాక అప్పుడు వెనక్కి తీసుకు వస్తారు. ఏ ఎల్.కే.జిలో వేసే వయసు వచ్చాకో ఆఫీసుకు వెళుతూ కారులో దారిలో స్కూల్లో దింపి వెళతారు. బేబీ సిట్టర్స్ అవసరం ఉండదప్పుడు

అయితే ఊహ తెలిసినప్పటి నుంచీ వేరే దేశంలో, వేరే మనుషుల దగ్గర పెరిగిన ఆ పిల్లలు తమ తల్లిదండ్రులకి, అమెరికాకి అలవాటయ్యేలోగా ఇండియా మీదా, అక్కడి బంధుమిత్రుల మీదా బెంగ కలగడం సహజం. ఒకోసారి ఆ బెంగతో జ్వరం కూడా వస్తుంటుంది వాళ్ళకి.

ముగ్గురు పిల్లలను కన్న లక్ష్మి అందుకే కొందరు తెలుగు భార్యల్లా ఉద్యోగంలో చేరలేదు.

వాణి అమెరికా వచ్చిన వారంలో బాపన్న, ముకుందం, ముకుందం తల్లిదండ్రులు అనేకసార్లు ఆమెకు గుర్తుకొచ్చారు. వాళ్ళకు ఉత్తరం రాద్దామనుకుంటూనే అశ్రద్ధ చేసింది.

ఈలోగా ట్వెల్త్‌క్లాస్‌లో చేరింది ఓ స్కూల్లో.

బే ఏరియా రేపిడ్ ట్రాన్స్‌సిట్ (బి.ఏ.ఆర్.టి)లో బస్సు నంబరు 77 ఎక్కి ఫస్ట్ స్ట్రీట్‌లో దిగుతుంది. అక్కడ ట్రాలీ ఎక్కి డౌన్ టౌన్‌కి వెళ్ళే దారిలో ఓ స్టాప్‌లో దిగుతుంది. అక్కడ నుంచి రెండు నిముషాల నడక దూరంలో వుంది ఆమె స్కూలు. ఇండియా నుంచి వచ్చిన వాణికి అమెరికన్ చదువు ఏ మాత్రం కష్టం కాలేదు. మధ్యలో చేరినా తేలిగ్గా పికప్ చేసింది.

వెంకటేశ్వరరావు ఇంట్లో వున్న కంప్యూటర్‌లో ఇంటర్ నెట్ గ్రూప్‌కి ఏక్సెస్ వుంది. ఇది ఇటీవలే ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఎలక్ట్రానిక్ మెయిల్ సర్వీస్ లాంటిది.

'సొసైటీ డాట్ కల్చర్ డాట్ ఇండియా డాట్ తెలుగు' దాని ఏక్సెస్ కోడ్ ఆ సౌకర్యం వున్న వాళ్ళు ప్రపంచంలోని ఈ సౌకర్యం గల ఇతర తెలుగు వాళ్ళతో టచ్‌లో ఉండగలుగుతారు. ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, సౌత్ ఆఫ్రికా.. ప్రపంచంలో ఏ దేశంలో వున్న తెలుగువాళ్ళతోనైనా ఇంటర్‌నెట్ బులెటిన్ బోర్డు ద్వారా టచ్‌తో ఉండవచ్చు.

ఆ ఐటమ్ ఎంతో ఆసక్తి ఉండటంతో వాణి ఎక్కువకాలం కంప్యూటర్ ముందు కూర్చుని ఇంటర్ నెట్‌తో కాలం గడపసాగింది.

ముకుందానికి లెటర్ రాయలేదు. కానీ, స్టేన్లీ బ్రాడ్‌బరీకి రాసింది.

17

వాణి అమెరికా వెళ్ళిన పధ్నాలుగో రోజు నుంచి ముకుందం వాణి నుంచి ఉత్తరం కోసం ఎదురుచూడసాగాడు. పోస్టాఫీసులో సార్టింగ్ అయ్యాక, తమ బీట్ పోస్టుమాన్ లెటర్స్ సర్దుకుంటుంటే, తనకి ఫారిన్ లెటర్ ఏదయినా వచ్చిందా అని వెళ్ళి అడగసాగాడు.

అలా నెలగడిచాక ముకుందం దిగులు అధికమయింది. 'తను ఇచ్చిన ప్రేమపుస్తకం చదివి చింపిపారేసి ఉంటుంది. తన మీద అలాంటి ఇష్టం లేకపోవడంతో కోపం వచ్చి ఉంటుంది. దాంతో ఉత్తరం కూడా రాయలేదు' అన్నది ముకుందం ఆలోచన.

తన మిత్రుడు బాపన్న కూడా ఊళ్ళో లేడు. అతను బంధువుల పెళ్ళికి నర్సాపూర్ వెళ్ళడంతో ముకుందానికి వాణి గురించి మాట్లాడటానికి ఎవరూ లేరు.

ప్రతిరోజూ ఉదయం కొండంత ఆశతో పోస్టాఫీసుకు వెళతాడు. ఆ రోజు తప్పకుండా వాణి నుంచి ఉత్తరం వస్తుందని రాకపోతే ఎంతో బాధపడిపోతాడు. ఆ పుస్తకం చదివిన వాణికి ఎంత కోపం వచ్చిందో ఊహించుకుంటాడు. 'కోపం రాకపోతే నో, సారీ! నాకు అలాంటి ఉద్దేశం లేదు' అని రాసి ఉండేది. నిజంగా కోపం వచ్చి ఉంటుంది అనుకుంటాడు. కానీ మర్నాడు ఉదయం ఆ నిరాశ మటుమాయమవుతుంది. మళ్ళీ గంపెడాశతో పోస్టాఫీస్‌కి వెళతాడు.

నెలన్నర తరువాత బాపన్న ఓ రోజు ముకుందం యింటికి వచ్చాడు.

"పద, బయటకెళదాం" చెప్పాడు హడావుడిగా.

ఇద్దరూ సైకిలు మీద డబుల్స్ వెళుతూండగా చెప్పాడు బాపన్న సంతోషంగా.

"నా కోరిక ఫలించిందిరా!"

"నళినీదేశ్ పాండే ఆంటీని అడిగావా? ఒప్పుకుందా?" అడిగాడు ముకుందం.

"కాదు, నర్సాపురం పెళ్ళిలో ఓ విధవావిడతో జరిగింది. ఛ నేననుకున్నంత బాగుండలేదు. ఎంతో గొప్పగా ఉంటుందనుకున్నాను అది."

"ఎవరా విధవావిడ?"

"వంట మనిషి"

"ఆంటీనా?"

"అవును"

"బాగా ఆంటీనా?"

"బాగా ఆంటీనే. ఏం?"

"నీ జన్మ తగలడ. మీ అక్కయ్య కూతురు వయసు వాళ్ళయితే బెటర్‌గా ఉండేదేమో?"

"ఏమో మరి? నన్ను చూసి నవ్వేది. ఓ రోజు ధైర్యం వచ్చి అడిగితే, వాళ్ళింటికి రమ్మంది. అప్పుడప్పుడూ వచ్చి వెళ్తూండమంది. కానీ, నాకేం బాగాలేదు. చాలామంది డబ్బు ఖర్చుచేసి, ఆ సింపుల్ దానికి వేశ్యల చుట్టూ ఎందుకు తిరుగుతుంటారో?"

"పోన్లే, నీవు కోరుకున్నది అయింది. ఇక పెళ్ళయ్యేదాకా ఇలాంటివాటి జోలికి పోకు."

"ఇంకెందుకు పోతాను చెత్తగా వుంటే?"

"వాణినుంచి ఇంతదాకా ఉత్తరం రాలేదురా?" చెప్పాడు ముకుందం దిగులుగా.

"అన్నట్లు నాకొచ్చింది."

"ఏమని రాసింది?" అడిగాడు ముకుందం ఆత్రంగా.

"వాళ్ళ నాన్న ఏదో క్రిస్టియన్ హాస్పిటల్లో చేరాట్ట. తను స్కూల్లో చేరిందట. నిన్ను అడిగానని చెప్పమంది."

"అంతే రాసిందా?"

"అంతే. పది లైన్లు మొత్తం."

"ఎక్కడుంది?"

"మా ఇంట్లో"

"పద, చూపించు"

ముకుందానికి ఆ ఏరోగ్రాంని పదిసార్లయినా చదివితే కాని తృప్తి కలగలేదు. ఎక్కడా తనమీద చెడ్డ అభిప్రాయం కాని, మంచి అభిప్రాయంకానీ వ్యక్తపరచలేదు. `ముకుందాన్ని, వాళ్ళ పేరెంట్స్‌ని అడిగినట్లు చెప్పు` అని రాసింది.

"నీకు రాసి, నాకు రాయలేదెందుకో?" బాపన్న అభిప్రాయం అడిగాడు ముకుందం.

"ఇద్దరికీ రాసి ఉంటుంది. పోస్టులో మిస్ అయి ఉండొచ్చు"

"నాకు రాస్తే ఆ సంగతి నీ ఉత్తరంలో రాసి ఉండేదిగా?"

"అమెరికా అమ్మాయి కదా! ఆ పుస్తకం చదివి అవతల పారేసి ఉంటుంది. ఏ జేమ్స్‌నో, జాన్‌నో చేసుకోవచ్చు కానీ, నీవు యిక ఆ ధ్యాస మరిచిపో."

ముకుందానికి బాధేసింది ఆ మాటలకి. అప్పటికప్పుడు ఓ ఏరోగ్రాం కొని బాపన్న చేత ఓ వైపు జవాబు రాయించాడు. తను రెండో వైపు రాశాడు.

**రాజమండ్రి**

**"డియర్ వాణీ!**

**పలుకే బంగారమాయెనా?**

**ఫ్రెండ్లీ,**

**ముకుందం"**

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments